# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. వచ్చే ఏడాది మార్చి నాటికి కోటి 12 లక్షల కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2. సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు.**

**3. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని ఆంధ్రపదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**

**4. యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగి నిరుద్యోగులైన వారికి ఉపాధి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు.**

**5. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 8వ పోషణ పఖ్వాడా--2026 కార్యక్రమాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి.**

==========================

వచ్చే ఏడాది మార్చి నాటికి రెండవ విడత రీ సర్వే ను పూర్తి చేసి కోటి 12 లక్షల కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికి 6వేల 9 వందల 76 గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా, వీటిలో 5వేల 7వందల 17 గ్రామాల్లో, 22లక్షల 79వేల పాసు పుస్తకాల పంపిణీ జరుగుతోందన్నారు. సర్వీస్ ఇనాం భూములను 22ఎ జాబితా నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 2016కు మందు ఏదైనా ప్రభుత్వ గృహనిర్మాణ పథకంలో పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. దీంతో దాదాపు 75 లక్షల పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని వెల్లడించారు.

--------------------------

సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాదులో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కంపెనీలు కార్పొరేట్ సామాజిక బాధ్యతకు చేస్తున్న వ్యయం వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు ఇతర ఏ రంగాన్నైనా ఎంచుకొని కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు వినియోగించాలని సూచించారు..

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని, వేమూరు నియోజకవర్గం పరిధిలోని భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి పంపిణీ చేస్తారు. ఈ ఉదయం ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సూరేపల్లి గ్రామానికి చేరుకుంటారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో పాల్గొని ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తారు. అనంతరం రెవెన్యూ సమస్యలపై రైతులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చిస్తారు. సాయంత్రం హెలికాప్టర్ ద్వారా సూరేపల్లి నుంచి ఉండవల్లిలోని నివాసానికి చేరుకుంటారన్నారని అధికారులు వెల్లడించారు.

---------------------------

విద్యార్థులే దేశ భవిష్యత్తు అని ఆంధ్రపదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సమాజం కోసం ఆలోచిస్తూ బాధ్యతతో పనిచేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విశాఖలో నిన్న నిర్వహించిన మెగా కల్చరల్ ఫెస్ట్ ముగింపు వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రపంచాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధం విద్య అని, సమాజ సేవే యువత ధ్యేయం కావాలని కోరారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఒక క్యాంపస్ మాత్రమే కాదని, భారతీయ వారసత్వ సంపదకు చిహ్నమని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

దేశ వ్యాప్తంగా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 8వ పోషణ పఖ్వాడా-2026 కార్యక్రమాలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది పోషణ పఖ్వాడా చిన్నారుల్లో 'మొదటి ఆరు సంవత్సరాల్లో మెదడు అభివృద్ధి గరిష్టంగా పెంపొందించడం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు, పోషణ పంచాయతీలు, ఆటల ఆధారిత అభ్యాస కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చిన్నారుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, స్క్రీన్ టైమ్ తగ్గింపు వంటి అంశాలపై ప్రచారం చేపట్టనున్నారు.

---------------------------

భారత ప్రభుత్వ కేంద్ర గణాంక, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్ విశాఖపట్నంలోని జాతీయ గణాంక కార్యాలయాన్ని నిన్న సందర్శించారు. దేశవ్యాప్తంగా ఈ నెలలో ప్రారంభమైన్న నేషనల్ హౌస్‌హోల్డ్ ఇన్‌కమ్ సర్వే ఫీల్డ్ వర్క్ ను ప్రత్యక్షంగా నిన్న పరిశీలించి, సర్వే నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్..26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల బృందం నిన్న సమావేశం అయ్యింది. అమరావతినిలో రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు.. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు, ఐటి, విద్యుత్ రంగ సంస్కరణల అమలుకు పెద్దయెత్తున అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి, వాణిజ్య కార్యకలాపాలకు అమరావతి కేంద్రంగా మారుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అమరావతి అభివృద్ధితోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ప్రపంచ బ్యాంక్ బృందానికి వివరించారు. మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

---------------------------

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగి నిరుద్యోగులైన వారికి ఉపాధి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా, నంబూరులోని నాగార్జున యూనివర్శిటీలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కుల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సును నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ

---------------------------

మహిళా సాధికారితే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను తిరుపతి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన విశ్వకర్మయోజన పథకంతో పలు రంగాల్లో శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ పథకం ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందిన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలేనికి చెందిన ప్రియాంక ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

ఛత్తీస్‌గఢ్‌పై ఉపరితల ఆవర్తనం విస్తరించిందని తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉత్తర-దక్షిణ ద్రోణి ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఆంధ్ర, రాయలసీమ, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది.

మరోవైపు తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని హైదరాబాద్ లోని వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================